కరుణించు దుర్గమ్మా

మహిషాసురమర్దిని అవతారంలో అమ్మవారు


నర్సీపట్నంలో మహిషాసుర మర్దిని అలంకరణలో అమ్మవారు


మాడుగులలో దేవతా చెట్టును దర్శించుకుంటన్న మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, తదితరులు


కె.కోటపాడు వాసవీమాత ఆలయంలో కుంకుమ పూజ చేస్తున్న మహిళలు


నాతవరంలో అమ్మవారి సారెను ఊరేగిస్తున్న భక్తులు


వంటర్లపాలెంలో మహిషాసురమర్దిని అవతారంలో..


కొత్తపెంట శివారు కొత్తూరులో సారె ఊరేగింపులో పాల్గొన్న భక్తజనం

నర్సీపట్నం: శరన్నవరాత్రి మహోత్సవాలు ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తూ భక్తులు తరిస్తున్నారు. పట్టణంలో శ్రీదుర్గామల్లేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారు బుధవారం మహిషాసురమర్దిని అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు, సామూహిక కుంకుమార్చన నిర్వహించారు.

మాడుగుల: మాడుగులలో మహిషాసురమర్దిని అవతారంలో ఉన్న దేవీతల్లిని మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు అనంతరం సివిల్ ఆర్టీసీ, ఆటో, మోటార్ యూనియన్ సభ్యులు ఆయనతో పాటు ఎంపీపీ తాళ్ళపురెడ్డి వెంకట రాజారామ్, మాజీ ఎంపీపీ వేమవరపు రామధర్మజ, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు బొమ్మిశెట్టి శ్రీనువాసరావును సత్కరించారు. మాజీ ఎంపీపీ రామధర్మజ వెండితో తయారు చేసిన గధను ఆలయ కమిటీ సభ్యులకు బహూకరించారు. అలాగే దుర్గాలమ్మతో పాటు దేవతా చెట్టును కూడా మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ గౌరవాధ్యక్షుడు దేవరాపల్లి శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ దంగేటి సూర్యారావు, సర్పంచ్ ఎడ్ల కళావతి, సీడీసీ చైర్మన్ సుంకర శ్రీనివాసరావు, యూనియన్ సభ్యులు, ఆలయ కమిటీ గౌరవాధ్యక్షుడు బసవారామ పరమేష్ పాల్గొన్నారు.

కె.కోటపాడు: స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారికి ఆలయ కమిటీ సభ్యులు లక్ష కుంకుమార్చన పూజ నిర్వహించారు. ఆలయ అర్చకుడు గోరుగుంతు రమేష్‌బాబు పర్యవేక్షణలో కె.కోటపాడుతో పాటు పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొని పూజలు చేశారు.


బోయిలకింతాడలో దుర్గాదేవిని దర్శించుకుంటున్న మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

నాతవరం: స్థానిక శ్రీశక్తి పంచాయతన ఆలయంలో అమ్మవారు బుధవారం దుర్గాదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారి సారె ఊరేగింపు వైభవంగా సాగింది.

మాడుగుల రూరల్: కె.జె.పురం, వంటర్లపాలెం గ్రామాల్లో భవానీ భక్తులు ఘాటాలతో ఊరేగింపు నిర్వహించారు. వంటర్లపాలెంలో కనకదుర్గమ్మ.. మహిషాసురమర్దిని అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

దేవరాపల్లి: బోయిలకింతాడలో దుర్గాదేవి అమ్మవారిని మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు దర్శించుకున్నారు. అనంతరం జరిగిన భారీ అన్నసమారాధనలో ఆయన పాల్గొని భక్తులకు వడ్డించారు. స్థానిక సర్పంచ్ బూరె బాబూరావు, కె.వి.రమణ, అన్నం రాము, దాసరి వెంకటరమణ, వరదపు రెడ్డి అప్పలనాయుడు, కొరుపోలు శ్రీను, రంధి వెంకటరావు, శనివాడ రాజు, అన్నం వెంకటరావు పాల్గొన్నారు.

దేవరాపల్లి: కొత్తపెంట శివారు కొత్తూరులో పైడిమాంబ అమ్మవారి సారే ఊరేగింపు బుధవారం కనుల పండువగా సాగింది. స్థానిక సర్పంచ్ రొంగలి వెంకటరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అధిక సంఖ్యలో మహిళలు పసుపు, కుంకుమ కావిడతో పాటు వివిధ రకాలు పిండి వంటలు, పండ్లు, స్వీట్లను ఊరేగింపుగా తీసుకువచ్చి అమ్మవారికి సమర్పించారు. మధ్యాహ్నం నిర్వహించిన అన్నసమారాధనలో 11 రకాల స్వీట్లను వడ్డించారు. మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు ముఖ్యఅతిథిగా పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ కర్రి సత్యం, మాజీ సర్పంచ్ రొంగలి శంకరరావు, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో అన్నసమారాధన

గొలుగొండ: శరన్నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా చిన్నయ్యపాలెం, బీసీ కాలనీ, ద్వారకానగరం గ్రామాల్లో ఉన్న కనకదుర్గ ఆలయాల వద్ద పెద్ద ఎత్తున అన్నసమారాధన నిర్వహించారు. రాత్రికి ఆలయాల వద్ద భజనలు చేశారు.

బుచ్చెయ్యపేట: వడ్డాది పెదబజారు వీధిలో దేవి మండపం వద్ద అన్నసమారాధన నిర్వహించారు. సుమారు 4 వేల మంది అన్నప్రసాదం స్వీకరించారు.

క్లుప్తంగా

సంతలో నాటుకోళ్లకు గిరాకీ


చౌడువాడ వారపు సంతలో నాటుకోళ్ల అమ్మకాలు

కె.కోటపాడు: చౌడువాడ గ్రామంలో బుధవారం జరిగిన వారపుసంతలో నాటుకోళ్ల ధరలకు రెక్కలొచ్చాయి. విజయదశమి పర్వదినం సందర్భంగా నాటుకోళ్ల కోసం పెద్ద సంఖ్యలో కొనుగోలుదారులు సంతకు వచ్చారు. 2 కిలోల బరువు గల కోడిపుంజుల ధర ఒక్కొక్కటి రూ.1500 నుంచి రూ.2వేల వరకూ పలికాయి. ధరలు పెరిగినా పండగ నేపథ్యంలో కోనుగోలు చేసేందుకు ప్రజలు ఆసక్తి చూపారు. దీంతో నాటుకోళ్ల అమ్మకాల వద్ద సందడి నెలకొంది.

బాపూ మార్గం అనుసరణీయం


గాంధీ విగ్రహానికి పూలమాల వేస్తున్న సర్పంచ్ వెంకట రామలక్ష్మి, ఎంపీటీసీ గోపి

కె.కోటపాడు: మహాత్మ గాంధీజీ చూపిన అహింసా మార్గం అనుసరణీయమని పిండ్రంగి సర్పంచ్ జాగరపు వెంకట రామలక్ష్మి, ఎంపీటీసీ నెక్కల గోపి అన్నారు. పిండ్రంగిలో ముందస్తుగా గాంధీ జయంతి కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. సంపద తయారీ కేంద్రం వద్ద ఉన్న గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సత్యం, శాంతి, అహింసా అనే వాటినే ఆయుధాలుగా చేసుకొని తెల్లదొరలపై గాంధీజి పోరాటాన్ని సాగించి స్వాతంత్ర్యసాధనలో ప్రధాన భూమికను పోషించారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి చినబాబు, నాయకులు చంద్రావు, అప్పారావు, భానుప్రసాద్, రమణ, సన్యాసినాయుడు పాల్గొన్నారు.

పొలాల ముంపు నివారణకు చర్యలు

- శృంగవరంలో ప్రత్యామ్నాయ కాలువ ఏర్పాటుకు కృషి
- రేపు రామాలయం వద్ద గ్రామసభ నిర్వహణ
- నాతవరం తహసీల్దార్ వేణుగోపాల్


శృంగవరంలో ఇరువర్గాల రైతులతో మాట్లాడుతున్న తహసీల్దార్ వేణుగోపాల్

నాతవరం: పంట పొలాల్లో నీరు నిలిచిపోకుండా చర్యలు చేపడతామని తహసీల్దార్ ఎ.వేణుగోపాల్ తెలిపారు. మండలంలో శృంగవరం గ్రామంలో ఏడేళ్ల క్రితం మాజీ సర్పంచ్ ఉలబాల అప్పలనాయుడు పంట పొలాల్లోకి రోడ్డు నిర్మించారు. ఈరోడ్డు వేసిన దగ్గర్నుంచి ఎగువ ప్రాంతం నుంచి వచ్చిన నీరు బయటకు ప్రవహించకుండా నిల్వ ఉండిపోవడంతో ఆ భూమిలో వరినాట్లు వేయడానికి ఆటంకంగా మారింది. దీనిపై ఆయా భూముల రైతులు గత నెల 29న ఆందోళన చేశారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ వేణుగోపాల్ స్పందించి బుధవారం నీటి ముంపునకు గురైన పొలాలను పరిశీలించారు. రైతులు, ప్రజాప్రతినిధులతో గ్రామంలో చర్చించారు. ఈ రోడ్డు తాలుకా పూర్వపరాలను మాజీ సర్పంచ్ ఉలబాల అప్పలనాయుడును అడిగి తెలుసుకున్నారు. రోడ్డు వేయక ముందు నీరు ఎలా పోయేది, ప్రస్తుతం నీరు పొలాల్లో నిలిచిపోవడానికి గల కారణాలు చెప్పాలన్నారు. ఈ రోడ్డుతో ఈ ప్రాంత రైతులకు అన్ని విధాలుగా ఉపయోగకరమని, నీరు పోవడానికి ఉన్న మార్గాన్ని స్వయంగా తీసుకెళ్లి తహసీల్దార్‌కు ఆయన చూపించారు. తర్వాత ముంపు బాధిత రైతులతో తహసీల్దార్ మాట్లాడారు. అనంతరం తహసీల్దార్ విలేకరులతో మాట్లాడుతూ పొలాల్లో నీరు బయటకు పోయేలా ప్రత్యామ్నాయ మార్గం ఏర్పాటు చేస్తామన్నారు. ముందుగా ప్రభుత్వ భూములకు సంబంధించి సర్వే చేస్తామన్నారు. ఈ ఆయకట్టు భూములు తాండవ ప్రాజెక్టు పరిధిలో ఉన్నాయన్నారు. కాలువలకు తూరలు ఏర్పాటు చేయాలంటే తాండవ ఇరిగేషన్ శాఖ ఇంజినీర్ల అనుమతితో ఏర్పాటు చేయాలన్నారు. దీనిపై శుక్రవారం స్థానిక రామాలయం వద్ద గ్రామసభ ఏర్పాటు చేసి, తాండవ జేఈ ఆధ్వర్యంలో నీరు పోయేలా తూరలు ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ నాగరాజు, తాండవ ప్రాజెక్టు నీటి సంఘం అధ్యక్షుడు ఉలబాల పేర్రాజు, ఆయకట్టు రైతులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో హెడ్ కానిస్టేబుల్ మృతి


దినబంధ్(ఫైల్)

గొలుగొండ: కృష్ణదేవిపేట పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పని చేస్తున్న కె.దినబంధ్(48) బుధవారం అనారోగ్యంతో విశాఖలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. కొంత కాలంగా ఆయన కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నారు. వారం రోజులుగా ఆస్పత్రిలో వైద్య సేవలు పొందుతున్నారు. దినబంధ్ మృతి చెందడంతో కృష్ణదేవిపేట పూర్వపు ఎస్ఐ తారకేశ్వరరావుతోపాటు పోలీస్ సిబ్బంది సంతాపం తెలిపారు.

ఘనంగా వృద్ధుల దినోత్సవం


కొవ్వూరు ఆశ్రమంలో వృద్ధులను సన్మానిస్తున్న సర్పంచ్ కాంతమ్మ


అప్పలరాజుపురం శ్రీలలితాదేవి వృద్ధాశ్రమంలో వృద్ధులకు భోజనం వడ్డిస్తున్న సంస్థ ప్రతినిధులు

రోలుగుంట: వృద్ధుల దినోత్సవాన్ని పలు చోట్ల బుధవారం ఘనంగా నిర్వహించారు. కొవ్వూరు గ్రామంలో ఉన్న ఆశ్రమంలోని వృద్ధులకు సర్పంచ్ కాంతమ్మ పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. అనంతరం పలువురు వృద్ధులను సత్కరించారు. ఆశ్రమంలోని వృద్ధులతో పాటు గ్రామానికి చెందిన పలువురు వృద్ధులకు ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనం ఏర్పాటు చేశారు. వృద్ధులు ఆటలు, పాత పాటలు పాడుతూ రోజంతా ఆనందంగా గడిపారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకుడు రాజారావు, సచివాలయ కార్యదర్శి జి.వరలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి విజయ్‌కుమార్, వైఎస్సార్‌సీపీ నాయకుడు గుణశేఖర్ పాల్గొన్నారు.

చీడికాడ: అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవాన్ని అప్పలరాజుపురం శ్రీలలితాదేవి వృద్ధాశ్రమంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రిత్వ శాఖ మై భారత్ విశాఖ సంస్థ డిప్యూటీ డైరెక్టర్ మహేశ్వరరావు మాట్లాడుతూ వృద్ధుల సంక్షేమానికి అవసరమైన ప్రాథమిక సౌకర్యాలు కేంద్ర ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో వృద్ధాశ్రమ నిర్వాహకురాలు యాళ్ల వెంకటలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

వీహెచ్‌పీ మండల అధ్యక్షుడిగా మురళీకృష్ణ


మండల అధ్యక్ష, కార్యదర్శులను అభినందిస్తున్న వీహెచ్‌పీ జిల్లా ఉపాధ్యక్షుడు రామకొండలరావు

మాడుగుల రూరల్: విశ్వ హిందూ పరిషత్ మండల అధ్యక్షుడిగా పుట్టా మురళీకృష్ణను బుధవారం ఎన్నుకున్నారు. కె.జె.పురం జంక్షన్‌లోని కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో జరిగిన దుర్గావాణి మండల కమిటీ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యదర్శిగా తాళ్లపురెడ్డి త్రినాథ్(విశ్రాంత వీఆర్వో) ఎన్నికయ్యారు. కొత్త కమిటీని వీహెచ్‌పీ జిల్లా ఉపాధ్యక్షుడు రాపేట రామకొండలరావు అభినందించారు. ఈ కార్యక్రమంలో ధర్మప్రచారక్ తవ్వా సన్యాసిశెట్టి, ప్రఖండ బాధ్యులు కరణం దేముళ్లు, జిల్లా దుర్గావాహని కమిటీ సభ్యురాలు కరణం వెంకటలక్ష్మి, వీహెచ్‌పీ మండల ఉపాధ్యక్షుడు పాచిల అప్పారావు, మహిళా ప్రముఖ్ పడాల శ్రావణి, చుక్కల అప్పారావు, తదితర్లు పాల్గొన్నారు. అనంతరం ఆలయంలో భగవద్గీత శ్లోకాలు, ప్రవచనాలు భక్తులకు సవివరంగా చెప్పిన విశ్రాంత ఏఈ శరగడం పరదేశినాయుడును సన్మానించారు.

చింతలపూడిలో రేషన్ స్టాక్ పాయింట్ ఏర్పాటుకు కృషి


చింతలపూడి గిరిజనులతో మాట్లాడుతున్న తహసీల్దార్ పి.లక్ష్మీదేవి, సీఎస్‌డీటీ రవిబాబు

దేవరాపల్లి: చింతలపూడి పంచాయతీకి ప్రత్యేక రేషన్ స్టాక్ పాయింట్(రేషన్ నిల్వ కేంద్రం) ఏర్పాటుకు కృషి చేస్తామని తహసీల్దార్ పి.లక్ష్మీదేవి తెలిపారు. తమ పంచాయతీకి ప్రత్యేక రేషన్ డిపో ఏర్పాటు చేయాలని కోరుతూ చింతలపూడి పంచాయతీకి చెందిన గిరిజనులు మంగళవారం ఆందోళన చేపట్టి, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం నాయుకుడు డి.వెంకన్నతో కలిసి తహసీల్దార్‌కు వినతిప్రతం అందజేసిన విషయం తెలిసిందే. దీనిపై స్పందించిన ఆమె సీఎస్‌డీటీ రవిబాబుతో కలిసి బుధవారం చింతలపూడి పంచాయతీలో బుధవారం పర్యటించారు. స్థానిక గిరిజనులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కొత్త రేషన్ డిపో ఏర్పాటుకు ప్రభుత్వం నుంచి అనుమతి రావాలని, తాత్కాలికంగా చింతలపూడి రైతు సేవా కేంద్రంలో స్టాక్ పాయింట్ ఏర్పాటుకు కలెక్టర్, ఆర్డీవోల అనుమతి కోసం ప్రతిపాదనలు పంపిస్తామన్నారు.

దేవరాపల్లిలో గడ్డివాము దగ్ధం

దేవరాపల్లి: మండల కేంద్రం దేవరాపల్లిలో రొంగలి సన్యాసమ్మకి చెందిన గడ్డివాము మంగళవారం రాత్రి దగ్ధమైంది. స్థానికుల సమాచారంతో సంఘటనలా స్థలానికి వచ్చిన అగ్నిమాపక శకటం సిబ్బంది మంటలను అదుపు చేశారు. బాధితురాలి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బంగారమ్మపాలెంకు వెళ్లే రహదారిలో రోడ్డుకు ఆనుకొని ఉన్న తమ కల్లంలో పాడి పశువుల మేత కోసం రూ.40 వేలు విలువ చేసే 11 ట్రాక్టర్ల గడ్డిని కొనుగోలు చేసి గడ్డిమేటు ఏర్పాటు చేశామన్నారు. మంగళవారం సాయంత్రం తాము కల్లం నుంచి ఇంటికి వెళ్లిన తర్వాత గిట్టని వారు తమ గడ్డివాముకు నిప్పు పెట్టి ఉంటారని ఆమె ఆరోపించారు. ఇదే విషయమై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని ఆమె చెప్పారు.

బ్రహ్మోత్సవాల్లో కోలాటం బృందం


బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న బృందం సభ్యులు

మాకవరపాలెం: తిరుమల తిరుపతి బ్రహ్మోత్సవాల్లో మాకవరపాలెం, నర్సీపట్నానికి చెందిన కోలాట బృందం సభ్యులు సందడి చేశారు. దాస సాహిత్య ప్రాజెక్టు, టీటీడీ ద్వారా పరమేశ్వరశర్మ, శిరీష దంపతుల ఆధ్వర్యంలో బ్రహ్మోత్సవాల్లో కోలాటం నిర్వహించారు. మాడ వీధుల్లో గజ వాహనం, సూర్యప్రభ వాహనాల ముందు పల్లె పడుచు వేషధారణల్లో కోలాటం చేసే అవకాశం తమకు దక్కిందని బృందం సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు.

ఈదురు గాలుల బీభత్సం


తెగిపడిన వైర్లను సరిచేస్తున్న విద్యుత్ ఉద్యోగి

రోలుగుంట: అల్పపీడన ప్రభావంతో ఈదురు గాలులు బుధవారం బీభత్సం సృష్టించాయి. బుధవారం మధ్యాహ్నం ఒక్కసారిగా వాతావరణం మారి పలు గ్రామాల్లో ఈదురు గాలులతో కూడిన వర్షం పడింది. ఎం.కె.పట్నం శివారు పెదపేటకు వెళ్లే విద్యుత్ లైన్లపై చెట్టు కూలి వైర్లు తెగిపడ్డాయి. వెంటనే విద్యుత్ సరఫరాను నిలిపి సంఘటన స్థలానికి వెళ్లి వైర్లు సరిచేసే పనులు పూర్తి చేశారు.

గొలుగొండ: మండలంలో జోగుంపేట, చిన్నయ్యపాలెం, పాతమల్లంపేట, పప్పుశెట్టిపాలెం తదితర ప్రాంతాల్లో బుధవారం భారీ వర్షం కురిసింది. రెండు గంటల పాటు కురిసిన వర్షం కారణంగా దారగెడ్డ, బోరింగ్ గెడ్డలు పొంగి ప్రవహించాయి. మధ్యాహ్నం నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

సవరించిన జీఎస్టీపై అవగాహన

కె.కోటపాడు : కేంద్ర ప్రభుత్వం సవరించిన జీఎస్టీ ప్రకారం పలు వస్తువుల ధరలు తగ్గనున్నట్లు కె.కోటపాడు పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ దినేష్‌కుమార్ తెలిపారు. గొండుపాలెం, కొరువాడ గ్రామాల్లో బుధవారం ఆయన జీఎస్టీ తగ్గింపుపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దినేష్‌కుమార్ మాట్లాడుతూ వ్యాపారులు తగ్గిన జీఎస్టీ ప్రకారం అమ్మకాలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమాల్లో చౌడువాడ, కొరువాడ పశువైద్యాధికారులు సిహెచ్.వై.నాయుడు, సింహాచలంనాయుడు, పశు వైద్య సహాయకులు పాల్గొన్నారు.

చీడికాడ: జీఎస్టీ తగ్గింపుతో సామాన్యులకు ఊరట కలిగిందని ఖండివరం పశువైద్యాధికారి ఏసీహెచ్ గణేశ్వరరెడ్డి తెలిపారు. జైతవరంలో జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఈర్లె చైతన్య, ఎంపీటీసీ పైల ముత్యాలనాయుడు పాల్గొన్నారు.

నాతవరం: ప్రభుత్వం తగ్గించిన జీఎస్టీ కంటే అదనంగా విక్రయాలు చేస్తే వ్యాపారులపై చర్యలు తీసుకుంటామని నాతవరం ఎంపీడీవో శ్రీనివాస్ హెచ్చరించారు. చినగొలుగొండపేటలో మండల స్థాయి అధికారులతో కలిసి ఆయన అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తగ్గించిన జీఎస్టీ రేట్లు గతనెల 22 నుంచి అమల్లో వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వేణుగోపాల్ వ్యవసాయాధికారి సుగుణ, వివిధ శాఖలు అధికారులు పాల్గొన్నారు.

మాకవరపాలెం: జీఎస్టీ సవరణతో రైతులకు మేలు చేకూరుతుందని ఏవో అప్పారావు తెలిపారు. మండలం వ్యాప్తంగా అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ యాంత్రీకరణ పరికరాలపై 18 శాతం నుంచి 5 శాతానికి జీఎస్టీని తగ్గించారన్నారు. కార్యక్రమంలో ఏఈవో శేషునాయుడు పాల్గొన్నారు.

రావికమతం: మండలంలోని రైతు సేవా కేంద్రాల్లో జీఎస్టీ సవరణపై అవగాహన కల్పించారు. చినపాచిల గ్రామంలో జరిగిన కార్యక్రమంలో ఏవో రమేశ్ బాబు, స్థానిక రైతులు పాల్గొన్నారు.

కె.కోటపాడు: మండల వ్యవసాయాధికారి ఎం.వి.సోమశేఖర్ ఆధ్వర్యంలో దాలివలసలో రైతులకు సవరించిన జీఎస్టీపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దేముళ్లు, పీఏసీఎస్ సీఈవో ఈశ్వరరావు, వీఏఏ హరీష్ అప్పారావు, రైతులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.